సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 16 । డిసెంబర్ । 2024



కర్నూలు జట్టు విజయం
ఉత్కంఠగా సాగిన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ ఫైనల్ పోటీల్లో కర్నూలు జట్టు విజయం సాధించింది. విశాఖ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. 8లో



టమాట కిలో రూ.10
అనంతపురం కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
30.6°/11.4°

జిల్లా పరిధిలో ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

18 నుంచి 'పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్'

అనంతపురం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు 27వ అంతర్ పాలిటెక్నిక్ కళాశాలల టోర్నీ (స్పోర్ట్స్ మీట్) నిర్వహిస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 700 మంది పాల్గొనున్నారు. ఇందులో గెలుపొందిన వారు విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. ఈ క్రమంలో స్పోర్ట్స్ మీట్ వాల్‌పోస్టర్లను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయగిరిజమ్మ ఆదివారం ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్‌ఓ మలోల, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు ఆదర్శం పొట్టిశ్రీరాములు జీవితం



అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: తెలుగు జాతికి అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన జీవితం భావితరాలకు ఆదర్శమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కొనియాడారు. ఆదివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయసారథి, బీసీ సంక్షేమ వసతి గృహాల వార్డెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు పొట్టి శ్రీరాములు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఆదివారం పోలీస్ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతి నిర్వహించారు. ఎస్పీహాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ మహనీయుల జీవిత గాథలను స్మరించుకొంటూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీ విజయకుమార్, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ వలి తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి కొండపల్లి రాక

ప్రశాంతి నిలయం: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ), గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ఎన్ఆర్ఐ సాధికారత – సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ నెల 16న జిల్లా పర్యటనకు రానున్నారు. ఈ మేరకు కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16న ఉదయం విశాఖ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరిన మంత్రి 9.30 గంటలకు బెంగళూరు విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో 11.30 గంటలకు చిలమత్తూరు మండలం టేకులోడు గ్రామానికి చేరుకుని పలు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం పెనుకొండ సబ్ కలెక్టరేట్‌లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ జిల్లాలో ఎమ్ఎస్ఎంఈ ,సెర్ప్ కార్యక్రమాల అమలుపై అధికారులు, పారిశ్రామికవేత్తలతో సమీక్షించనున్నారు.

చిదిమేస్తున్న మట్కా



☞ ధర్మవరం పట్టణంలోని శివానగర్‌కు చెందిన పట్టుచీరల వ్యాపారి రాము (పేరు మార్చాం) ఆన్‌లైన్ మట్కా యాప్‌కు బానిసయ్యాడు. రూ.10 వడ్డీకి అప్పు తెచ్చి మరీ మట్కాలో పెట్టాడు. వడ్డీలు కట్టేందుకు రెట్టింపు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు తాళలేక ఉన్న ఇల్లు, పొలం అమ్మి అప్పులు చెల్లించి బెంగళూరుకు చేరుకుని కూలి పనులు చేసుకుంటున్నాడు.

☞ జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఆన్‌లైన్ మట్కా యాప్‌కు అలవాటు పడి బీటెక్ విద్యార్థి శివ తోటి స్నేహితులు, తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి ఎటో వెళ్లిపోయాడు. చివరకు బంధువుల వద్ద ఉన్నాడని తెలుసుకుని తల్లిదండ్రులు రూ.2 లక్షల అప్పులు చెల్లించి తిరిగి తీసుకువచ్చారు. చదువులో ఇంటెలిజెంట్ అయిన శివ ఆన్‌లైన్ జూదం కారణంగా బాగా వెనుకబడ్డాడు.

☞ బత్తలపల్లి మండలానికి చెందిన వెంకటప్ప కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆన్‌లైన్ మాట్కా యాప్ ద్వారా జూదం ఆడుతూ సంపాదన మొత్తం పోగొట్టుకుంటున్నాడు. దీంతో ఆ కుటుంబం దుర్భర పరిస్థితి అనుభవిస్తోంది. పైన చెప్పినవి మచ్చుకు కొన్ని ఉదాహరణలు మాత్రమే.

- ఆన్‌లైన్ యాప్‌ల జోరు
- పేద, మధ్య తరగతి ప్రజలు చిత్తు
- అప్పులు తీర్చలేక బలవన్మరణాలు
- ఊర్లు వదులుతున్న మరికొందరు బాధితులు

ధర్మవరం: ఆన్‌లైన్ మట్కా యాప్‌లతో నిరుపేద, మధ్యతరగతి ప్రజలు, యువత జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. రూ.100 ఖర్చు పెడితే రూ.9వేలు డబ్బు వస్తుందని ఆశకు పోయి అప్పులు చేసి వడ్డీలు కట్టలేక రుణదాతల ఒత్తిళ్లతో ఊర్లు వదిలి వెళ్లిపోయిన వారు కొందరైతే... అవమాన భారం భరించలేక జీవితం మీద విరక్తి చెంది బలవన్మరణాలకు పాల్పడిన వారి ఉదంతాలు ఉన్నాయి. జిల్లా పరిధిలోని ధర్మవరం, కదిరి, పెనుకొండ, హిందూపురం, రాప్తాడు నియోజకవర్గాలలో ఆన్‌లైన్ మట్కా యాప్‌ల ద్వారా జూదం జోరుగా సాగుతోంది.

జడలు విప్పుతున్న ఆన్‌లైన్ మట్కా భూతం

ఇటీవల సామాన్యుల నుంచి సంపన్నుల వరకు, నిరక్షరాస్యుల నుంచి విద్యా వంతుల దాకా ప్రతి ఒక్కరికీ ఆండ్రాయిడ్ ఫోన్‌లు 4జీ, 5జీ నెట్‌వర్క్‌తో అందుబాటులోకి వచ్చాయి. ఆన్‌లైన్ మట్కా యాప్‌ల ద్వారా జూదం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. అత్యాశకుపోయి ప్రజలు ఇళ్లు గుల్ల చేసుకుంటున్నారు.

అనధికార మట్కా యాప్‌లు

అనధికారికంగా రాష్ట్రీయంగా, జాతీయంగా, ప్రాంతీయంగా ఆన్‌లైన్ మట్కా యాప్‌లు నిర్వహిస్తున్నారు. కొందరు సైబర్ నేరగాళ్లు సైతం ఇలానే యాప్‌లను నిర్వహిస్తూ మోసం చేస్తున్నారు. ప్రస్తుతానికి అయితే రాష్ట్రంలో మట్కా కింగ్, సత్తా కింగ్ ఏపీ, ఏపీ మట్కా, తిరుమల మట్కా, విజయవాడ మట్కా తదితర యాప్‌లు ఎక్కువగా చలామణి అవుతున్నాయి. వీటి ద్వారా జిల్లాలో రోజూ లక్షలాది రూపాయల టర్నోవర్ జరుగుతున్నట్లుగా సమాచారం. వీటిలో ఏ ఒక్కటికి కూడా అనుమతి లేదు.

ఊర్లు వదులుతున్న బాధితులు

ఆన్‌లైన్ మట్కా యాప్‌ల కారణంగా అప్పులు చేసి.. రుణదాతల ఒత్తిళ్లు తాళలేక జిల్లా వ్యాప్తంగా పలు కుటుంబాలు ఊర్లు వదిలి వెళ్తున్నాయి. మరికొంత మంది బాహ్య ప్రపంచానికి ముఖం చూపించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. మరెన్నో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి.

కట్టడి కష్టతరం

మట్కా జూదం మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతుండటంతో పోలీసులు కట్టడి చేయడం కష్టతరమౌతోంది. ఎందుకంటే జూదం ఆడేవారిని గానీ, ఆడించే వారిని గానీ కనుగొనడం సాధ్యం కాదు. అయితే సైబర్ క్రైమ్ ఆధ్వర్యంలో ఈ ఆన్‌లైన్‌యాప్‌లు ఇన్‌స్టాల్ కాకుండా వెబ్‌సైట్‌లను బ్యాన్ చేయడం ద్వారా కట్టడి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపడితే ఎంతో మంది పేద, మధ్యతరగతి, యువత జీవితాలను కాపాడిన వారవుతారు.

ఆశ చూపి బానిసను చేసి..



ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మట్కా నిర్వహిస్తున్న పలు అనధికారిక కంపెనీలు, సైబర్ నేరగాళ్లు పేద, మధ్యతరగతి ప్రజలు, యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నారు. 24 గంటలూ అందుబాటులో ఉంటూ గంట గంటకూ ఫలితాలు వెల్లడిస్తూ అమాయకులను మోసం చేస్తున్నారు. ఆన్‌లైన్ మట్కా యాప్‌లలో తొలుత లాగిన్ అయిన తర్వాత ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా డబ్బు స్వీకరిస్తారు. సింగిల్ డిజిట్, డబుల్ డిజిట్, త్రీస్టార్ వంటి పేర్లతో జూదం ఆడిస్తారు. ప్రజలు తాము చెప్పిన నంబర్ తగిలితేనే వారికి యాప్‌ల ద్వారా డబ్బు చెల్లిస్తారు. లక్షలో పది మంది కూడా ఈ యాప్‌ల ద్వారా లబ్ధి పొందరు. అయితే తొలుత చిన్న చిన్న మొత్తాలు వేసిన వారి వివరాలు సేకరించి యాప్‌ల నిర్వాహకులు వారు చెప్పిన నంబర్లే తగిలే విధంగా చేస్తారు. నెమ్మదిగా వారు అలవాటు పడగానే జూదానికి బానిసయ్యే విధంగా మార్చేస్తారు.

ఉక్కుపాదం మోపుతాం



ఆన్‌లైన్ మట్కా జూదం ఆడేవారిని, ఆడించే వారిపై ఉక్కుపాదం మోపుతాం. ఈ దిశగా ఇప్పటికే ప్రజలకు అవగాహన పెంపొందిస్తున్నాం. సైబర్‌క్రైం సహకారంతో ఆన్‌లైన్ మట్కా యాప్‌లు, వెబ్‌సైట్‌లు నిర్మూలించేందుకు చర్యలు చేపట్టాం. పేద, మధ్య తరగతి ప్రజలు జూదం వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని వ్యసనాలకు దూరంగా ఉండాలి.
– వి.రత్న, ఎస్పీ

నేడు ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక

పుట్టపర్తి టౌన్: ఎస్పీ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. అర్జీదారులు ఆధార్‌కార్డును తప్పని సరిగా వెంట తీసుకు రావాలని ఎస్పీ రత్న సూచించారు.

క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి



బ్యాటింగ్ ఆడి మ్యాచ్ ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని ఎస్పీ రత్న సూచించారు. పోలీస్ స్పోర్ట్స్‌లో మీట్‌లో భాగంగా ఆదివారం పోలీస్ పరేడ్ మైదానంలో ఫైనల్ మ్యాచ్‌ను ఎస్పీ రత్న ప్రారంభించారు. అనంతరం కాసేపు బ్యాటింగ్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఎస్పీ మాట్లాడుతూ శరీర దృఢత్వానికి క్రీడలు ఎంతో అవసరమని, పోలీసులు దైనందిన జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని పేర్కొన్నారు.

ఆర్మ్‌డ్ రిజర్వ్ జట్టు విజయం

హిందూపురం సబ్ డివిజన్ పోలీస్ జట్టు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో తలపడ్డాయి. హిందూపురం సబ్ డివిజన్ జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 105 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ జట్టు 11 ఓవర్లలోనే 105 పరుగులు చేసి విజయం సాధించింది. అంబ్రిష్ 47 పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి డీఎస్పీ విజయకుమార్, హిందూపురం డీఎస్పీ మహేష్, అర్ఐలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవం.. బ్రహ్మ రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

మడకశిరరూరల్: అశేష భక్తజనం గోవిందనామ స్మరణ నడుమ భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మ రథోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. తొలుత ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు ఉత్సవమూర్తులను భక్తుల సమక్షంలో ఊరేగింపుగా తీసుకువచ్చి రథంలో కొలువుదీర్చారు. పురోహితులు హోమం, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రథాన్ని లాగారు. ఆ సమయంలో భక్తులు బొరుగులు, అరటిపండ్లు రథంపైకి విసిరి భక్తిప్రపత్తులు చాటుకున్నారు. రథం వద్ద ప్రసాదం తీసుకోవడానికి, కొబ్బరి కాయలు కొట్టడానికి భక్తులు పోటీ పడ్డారు. అనంతరం ఆయా దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేయించారు. దాతలు భక్తులకు ప్రసాదం పంచిపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. రొళ్ల జెడ్పీటీసీ ఆనంతరాజు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రథోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రాగిరి రామయ్య ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, దేవదాయ శాఖ అధికారులు, రథోత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

నేడు జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు

భక్తరహళ్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచే జ్యోతులు, భూతప్ప ఉత్సవాలు సోమవారం జరగనున్నాయి. సంతానం లేని మహిళలు, వివిధ వ్యాధుతో బాధపడుతున్నవారు తడిస్నానం చేసి భూతప్పలు వచ్చే దారిలో బోర్ల పడుకుంటారు. భూతప్పలు వారిపై కాలుమోపుతూ వస్తారు. భూతప్పల కాలి స్పర్శతో రోగాలు నయమవుతాయని, కోర్కెలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం. భూతప్ప, జ్యోతుల ఉత్సవాలకు ఒక డీఎస్పీ, ఆరుగురు సీఐలు, 15 మంది ఎస్ఐలు, 195 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మడకశిర ఆర్టీసీ డిపో నుంచి వివిధ గ్రామాల మీదుగా 20కి పైగా బస్సులు నడుపుతున్నారు.

రక్త కన్నీరు

- హిమోఫీలియా బాధితుల నరకయాతన
- నాలుగు నెలలుగా ఫ్యాక్టర్ ఇంజెక్షన్లు లేని దుస్థితి
- ఆస్పత్రుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్న రోగులు
- డాక్టర్లను వేడుకుంటున్నా ఫలితం శూన్యం
- కూటమి సర్కారు అలసత్వంతో పరిస్థితి దయనీయం

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రాణ భయంతో కొట్టుమిట్టాడుతున్న రోగులను కూటమి సర్కారు పట్టించుకోవడం లేదు. కక్షగట్టి 108 వ్యవస్థను పీడిస్తుండటంతో ఇప్పటికే డయాలసిస్ రోగులకు ఉచిత రవాణా సౌకర్యం నిలిచిపోయింది. దీంతో రోగులు నరకయాతన అనుభవిస్తున్నారు. తాజాగా హిమోఫీలియా బాధితులు అదేకోవలోకి చేరారు.

ఖరీదైన వైద్యం..

హిమోఫీలియా అనేది భయంకరమైన జబ్బు. జన్యు లేదా ఎంజైముల లోపంతో చిన్నతనంలోనే వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కడైనా చిన్న గాయమైనా రక్తస్రావం ఆగదు. వీరికి రక్తం గడ్డకట్టే పరిస్థితి ఉండదు. రక్తం గడ్డ కట్టాలంటే ఫ్యాక్టర్ 8, ఫ్యాక్టర్ 7, ఫ్యాక్టర్ 9 ఇంజెక్షన్లు వాడాలి. వ్యాధి తీవ్రతను



బట్టి డాక్టరు సలహాతో రోజూ ఇంజెక్షన్లు వాడాల్సి ఉంటుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 160 మందికి పైగా హిమోఫీలియా బాధితులు ఉన్నారు. వీరికి నాలుగు నెలలుగా ఇంజెక్షన్లు అందుబాటులో లేకుండా పోయాయి. ఏ ప్రభుత్వాసుపత్రికి వెళ్లినా 'ప్రభుత్వం సరఫరా చేయడం లేదు' అనే మాట వినిపిస్తుండటంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. బెంగళూరు, హైదరాబాద్‌కు పరుగులు తీస్తున్నారు.

కూటమి సర్కారు నిర్లక్ష్యం..

ఒక్కో హిమోఫీలియా బాధితుడు సమస్య తీవ్రతను బట్టి నెలకు రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకూ వ్యయం చేయాల్సి ఉంటుంది. అయితే, వీరి సౌకర్యార్థం కేంద్ర ప్రభుత్వమే ఇంజెక్షన్లు అందిస్తోంది. జాతీయ హెల్త్ మిషన్ ద్వారా సమన్వయం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఆస్పత్రులకు వీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, కూటమి సర్కారు ఈ విషయంపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండటంతో బాధితులు నిత్యం నరకం చూస్తున్నారు. పదో తరగతి చదివే ఓ హిమోఫీలియా బాధితుడు ఇటీవల నార్పల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రక్తస్రావం నిలవకపోవడంతోనే విద్యార్థి ప్రాణాలు వదలడం గమనార్హం.

గతంలో ఎప్పుడూ కొరత లేదు..

2019–24 మధ్యకాలంలో ఫ్యాక్టర్ 8, ఫ్యాక్టర్ 7 ఇంజెక్షన్లకు ఎప్పుడూ కొరత తలెత్తలేదు. రోగులు ఇబ్బందులు పడకుండా సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచేవారు. ఇక అనంతపురం సర్వజనాసుపత్రిలో కచ్చితంగా స్టాకు ఉండేవి. దీంతో రోగులకు ఎంతో సాంత్వన చేకూరింది.

వైద్యశాఖ మంత్రి ఉన్నా తప్పని దుస్థితి



వైద్యశాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిమోఫీలియా బాధితులకు దయనీయ పరిస్థితులు తలెత్తడం బాధాకరం. చిన్న పిల్లల పరిస్థితి దారుణంగా ఉంటోంది. ఎప్పుడైనా రక్తస్రావం జరిగితే నరకం చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన మందులు సమకూర్చాలి.
– మఠం శ్యామ్ సుందర్ శాస్త్రి, హిమోఫీలిక్ సొసైటీ జిల్లా అధ్యక్షులు

సర్కారు కరుణించాలి



హిమోఫీలియా బాధితులకు చిన్నపాటి గాయమైనా రక్త స్రావం ఆగదు. మెట్లు ఎక్కి దిగాలన్నా, ఏదైనా పని చేద్దామన్నా సమస్యే. అంతర్గత రక్త స్రావం దీనికి కారణం. అలా జరిగిన సమయంలో వెంటనే ఇంజెక్షన్ వేయాలి. జాగ్రత్తగా ఉన్నా నెలకు కనీసం 3 వేల నుంచి 5 వేల యూనిట్స్ ఫ్యాక్టర్ అవసరం. పేద కుటుంబాలు బయట కొనుగోలు చేయడం సాధ్యపడదు. ప్రభుత్వం కరుణించాలి.
– షేక్ షెక్షావలి, గుంతకల్లు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇబ్బంది లేదు



గత ప్రభుత్వంలో ఫ్యాక్టర్‌కు కొదవ లేకుండా ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంచారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏ ఒక్క ఆస్పత్రిలోనూ ఇవి అందుబాటులో లేవు. రోగులందరూ నిరుపేదలే. అలాంటి వారు ఇంజెక్షన్లను బయట కొనుగోలు చేయడం అసాధ్యం. ప్రభుత్వం వెంటనే మందులను అందుబాటులో ఉంచాలి.
– తిమ్మరాజు, హిమోఫీలియా బాధితుడు

సిద్ధేశ్వరునికి లక్ష దీపోత్సవం



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి

అమరాపురం: హేమావతి గ్రామంలో సిద్ధేశ్వరస్వామికి ఆదివారం రాత్రి భక్తులు లక్ష దీపోత్సవం నిర్వహించారు. ఉదయం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. సాయంకాలం ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు, అర్చకులు లక్ష దీపోత్సవం ప్రారంభించారు. మడకశిర నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలతో పాటు కర్ణాటక రాష్ట్రం తుమకూరు, బెంగళూరు, పావగడ, చెళ్లికెర, మధుగిరి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దీపాలను వెలిగించి స్వామి వారికి మొక్కులు చెల్లించారు. భక్తులకు రొళ్ల మండలానికి చెందిన అడ్వకేట్ ఉమేష్ అన్నదానం ఏర్పాటు చేశారు.



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

పెరిగిన చలి తీవ్రత

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో చలితీవ్రత పెరిగింది. జనం గజగజ వణుకుతున్నారు. అనంతపురంతో పోల్చితే శ్రీ సత్యసాయి జిల్లాలో చలి తీవ్రత కాస్త అధికంగా ఉంది. ఆదివారం ఉదయం మడకశిరలో 11.4 డిగ్రీలు, బెళుగుప్పలో 12.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. అలాగే, రొద్దం 12.4, సోమందేపల్లి 12.7, గుమ్మఘట్ట, అగళిలో 13 డిగ్రీలు, పరిగి 13.1, నల్లమాడ 13.2, శెట్టూరు, చిలమత్తూరులో 13.4, ఓడీ చెరువు 13.6, కంబదూరు, రాయదుర్గం 13.7, రాప్తాడు 14.2, వజ్రకరూరు 14.3, ఉరవకొండ, బొమ్మనహాళ్ 14.7 డిగ్రీలు, కణేకల్లు 14.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగతా మండలాల్లో 14 నుంచి 17



డిగ్రీల మధ్య కొనసాగాయి. ప్రధానంగా మడకశిర, హిందూపురం, కదిరి, కళ్యాణదుర్గం, ఉరవకొండ డివిజన్లలో ఉష్ణోగ్రతలు బాగా తగ్గాయి. ఇక గరిష్ట ఉష్ణోగ్రతలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27 నుంచి 32 డిగ్రీల మధ్య నమోదయ్యాయి. మధ్యాహ్నం సమయంలో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నా ఎండతీవ్రత పెద్దగా లేదు. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు పొగమంచుతో వెలుతురు తగ్గిపోతోంది.

క్లుప్తంగా

నేటి నుంచి ధనుర్మాసం

హిందూపురం అర్బన్: విష్ణుమూర్తికి ఇష్టమైన మాసం ధనుర్మాసం సోమవారం నుంచి నెలరోజుల పాటు కొనసాగనుంది. సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం ప్రారంభమవుతుంది. ఈ నెల రోజుల పాటు వైష్ణవాలయాల్లో విశేషమైన పూజలు, సేవలు ఉంటాయి. ఈ మాసంలో మేలుకొలుపులు, గంగిరెద్దుల విన్యాసాలు, కోడి పందేలు, ఇళ్ల ముందు రంగవల్లుల సందడి ఉంటుంది. తాము పండించిన పంటను ఓ పండుగ వాతావరణంలో రైతులు ఇంటికి చేరుస్తుంటారు. దేవాలయాల్లో గోదారంగనాథ స్వాముల కల్యాణోత్సవాలు నేత్రపర్వంగా నిర్వహిస్తుంటారు. సంక్రాంతి వరకు ఈ వేడుకల ఆనందాయకంగా కొనసాగనున్నాయి. ఈ మాసంలో వచ్చే ముక్కోటి ఏకాదశి నాడు మహావిష్ణువుని ఉత్తర ద్వారం ద్వారా వెళ్లి దర్శిస్తే సకల దేవతలు దీవిస్తారనేది నమ్మకం. ఈ క్రమంలో ధనుర్మాస ఉత్సవాలకు పేట రంగనాథస్వామి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.

కర్ణాటక డీజిల్ డంప్ స్వాధీనం



కర్ణాటక డీజిల్‌ను సీజ్ చేస్తున్న పోలీసులు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా కర్ణాటక నుంచి పెద్ద మొత్తంలో దిగుమతి చేసుకుని విక్రయిస్తున్న డీజిల్‌ను పోలీసులు గుర్తించి సీజ్ చేశారు. అందిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి సీఐ కౌలుట్లయ్య, ఎస్‌ఐ గౌస్ మహమ్మద్‌బాషా, సిబ్బంది పెనకచెర్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డీజిల్ విక్రయిస్తున్న చిరంజీవి ఇంటి ఆవరణలో పెద్ద పెద్ద డ్రమ్ముల్లో నిల్వ ఉంచిన 2వేల లీటర్ల డీజిల్, బొలెరో, ఆటో వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సులో కర్ణాటక మద్యం సరఫరా



పట్టుబడిన కర్ణాటక మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

కణేకల్లు: కర్ణాటకలోని బళ్లారి నుంచి కళ్యాణదుర్గానికి అక్రమంగా ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న మద్యాన్ని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించి, సీజ్ చేశారు. ఆదివారం ఉదయం బళ్లారి నుంచి బయలుదేరిన కళ్యాణదుర్గం డిపో బస్సులో కళ్యాణదుర్గానికి చెందిన బోయ వన్నూరుస్వామి, బోయ మహేష్ 6 సంచుల్లో 576 హైవార్డ్స్ టెట్రా ప్యాకెట్లను తీసుకుని బయలుదేరారు. కణేకల్లు మండలం కణేకల్లుక్రాస్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన అనంతపురం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ అన్నపూర్ణ, సీఐ హరికృష్ణ, హెడ్ కానిస్టేబుల్ తదితరులు బస్సులో తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేశారు.

అ'విశ్రాంత' సేవకులు

సందర్భం

రేపు కదిరి 'ప్రభుత్వ పెన్షనర్ల సంఘం' వార్షికోత్సవం

గత ఐదేళ్లుగా సేవే పరమావధిగా పెన్షనర్లకు ఎన్నో విలువైన సేవలు అందిస్తున్న ప్రభుత్వ పెన్షనర్ల సంఘం కదిరి శాఖ సేవలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో పలువురు ఆపన్నులకు అండగా నిలిచిన వారు.... ఉద్యోగ విరమణ అనంతరమూ తమ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వస్తున్నారు.

- పెన్షనర్లకు ఏ ఆపద వచ్చిన సంఘం చేయూత
- ఐదేళ్లుగా దాతల సహకారంతో సేవా కార్యక్రమాలు



పెన్షనర్లకు నిర్వహించిన నేత్ర వైద్య శిబిరం (ఫైల్)



పెన్షనర్లను సన్మానించిన దృశ్యం (ఫైల్)

కదిరి టౌన్: రాష్ట్ర ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగులుగా కదిరి ప్రాంతంలో పనిచేసిన కొందరు ఉద్యోగ విమరణ అనంతరం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘంగా ఏర్పడ్డారు. దాదాపు ఐదేళ్ల క్రితం 2019, డిసెంబర్ 17న ఏర్పాటైన ఈ సంఘం అప్పటి నుంచి పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం సాగిస్తోంది. ఈ క్రమంలోనే స్ఫూర్తిదాయక సేవలతో పెన్షనర్లలో ఆత్మస్థైర్యాన్ని నింపుతోంది. కష్టాల్లో ఉన్న పెన్షనర్లకు మేమున్నామంటూ బాసటగా నిలుస్తోంది.

స్ఫూర్తిదాయక సేవలతో...

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఏర్పాటైన తర్వాత ఏటా సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మందికి లైఫ్ సర్టిఫికెట్లను అందజేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న 200 మందికి ఇంటి వద్దనే లైఫ్ సర్టిఫికెట్లు అందజేసేలా చర్యలు తీసుకున్నారు. పెన్షనర్లకు క్రమం తప్పకుండా జనరల్ హెల్త్ చెకప్ చేయిస్తున్నారు. ప్రతి మూడు నెలలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం, ఆరు నెలలకు ఒకసారి గుండె, మోకాళ్ల నొప్పులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకూ 600 మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. మరో 200 మందికి మోకాళ్ల శస్త్రచికిత్సలు చేయించారు. కరోనా సమయంలో అనాథలకు భోజన ప్యాకెట్లు అందజేశారు. అమడగూరులో ఉన్న వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న నిరాశ్రయులకు క్రమం తప్పకుండా అన్నదానంతో పాటు నూతన దుస్తులూ అందజేస్తున్నారు. కదిరి పట్టణంలోని మాధవ గురుకులంలో చదువుకుంటున్న 50 మంది నిరుపేద విద్యార్థులకు భోజన సదుపాయంతో పాటు, రూ.30 వేల ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. పెన్షన్‌దారుడు చనిపోతే వారి భార్యకు పెన్షన్ వచ్చేలా చొరవ తీసుకుంటున్నారు. సంఘం ఆవిర్భవించిన సందర్భాన్ని పురస్కరించుకుని ఏటా డిసెంబర్ 17న పెన్షనర్లు అందరూ కలసి పండుగ వాతావరణంలో గడిపేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా 75 సంవత్సరాలు పెన్షనర్లను సన్మానిస్తున్నారు.

ఆర్థిక సాయం అందజేస్తాం

ఏటా డిసెంబర్ 17న కదిరిలోని మాధవ గురుకుల పాఠశాల్లో చదువుతున్న నిరుపేద పిల్లలకు ఆర్థిక సాయం అందజేస్తాం. వారికి భోజన సదుపాయం కల్పిస్తాం. పెన్షనర్లు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తున్నాం. ఉచిత వైద్య శిబిరాలతో అండగా నిలుస్తున్నాం.

– ఆత్మారెడ్డి, కార్యదర్శి, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, కదిరి

పండుగలా జరుపుకుంటాం

ఏటా డిసెంబర్ 17న పెన్షనర్ల సంక్షేమ సంఘం వార్షికోత్సవాన్ని పండుగలా జరుపుతుంటాం. ఆ రోజున నిరుపేద విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్కులు పంపిణీ చేస్తాం. 75 సంవత్సరాలు నిండిన పెన్షన్‌దారులను సన్మానిస్తాం. పెన్షనర్లకు ఏ ఆపద వచ్చిన మేమున్నామంటూ అండగా నిలుస్తున్నాం.

– శివారెడ్డి, అధ్యక్షుడు, ప్రభుత్వ పెన్షనర్ల సంఘం, కదిరి

ప్రశ్నించే గొంతును నొక్కేస్తున్నారు

- విద్యను కాషాయీకరణ చేస్తున్నారు
- ప్రభుత్వాల తీరును అందరూ ప్రశ్నించాలి
- మానవ హక్కుల వేదిక రాష్ట్ర మహాసభల్లో వక్తలు



ప్రసంగిస్తున్న ఎస్ఎన్ సాహు

అనంతపురం కల్చరల్: ప్రశ్నించే గొంతును నొక్కేయడమే పాలకుల పనిగా ఉండడం ఆవేదన కల్గించే అంశమని మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు, మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వద్ద ఓఎస్డీగా పనిచేసిన ఎస్ఎన్ సాహు అన్నారు. సమాజంలో అన్నింటా హక్కులకు భంగం వాటిల్లుతోందన్నారు. అనంతపురం వేదికగా నిర్వహించిన మానవ హక్కుల వేదిక పదో రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్లో జరిగిన ఈ సభల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ అంశాలపై వక్తలు మాట్లాడారు. 'కుల గణన ఎందుకు అవసరం' అనే అంశంపై ఎస్ఎన్ సాహు ప్రసంగించారు. దేశంలో అనేక ఉపకులాల వారికి రిజర్వేషన్ల విషయంలో అన్యాయం జరుగుతోందన్నారు. కుల గణన సక్రమంగా, పారదర్శకంగా లేకపోతే ఆధిపత్య కులాలే రాజ్యాంగ ఫలాలను అనుభవిస్తాయని, అర్హులైన వారు అన్యాయమైపోతారని పేర్కొన్నారు. పాలకులు నిజాయితీగా కుల గణన చేయాలని, దాన్ని రాజకీయం చేయొద్దని హితవు పలికారు. సీనియర్ జర్నలిస్టు మాలిని సుబ్రమణ్యం 'బస్తర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనలు' అనే అంశంపై మాట్లాడుతూ చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని ఆదివాసీలపై కఠినమైన ఆంక్షలు ఉన్నాయన్నారు. పోలీసులే రాజ్యమేలుతున్నట్లుగా పరిస్థితి తయారైందన్నారు. సామాన్యులు బతకలేని స్థితికి వచ్చేయడం దారుణమన్నారు. అడవుల్లో వ్యవసాయం చేసుకోనీయకుండా ఆధిపత్యం చెలాయించే పద్ధతి పోవాలన్నారు. 'కాషాయీకరణ-కార్పొరేటీకరణ' అనే అంశంపై ఆచార్య కొప్పర్తి వెంకటరమణ మూర్తి ప్రసంగిస్తూ..ప్రస్తుతమంతా మత రాజకీయాలు నడుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూ మతమొక్కటే ఉన్నట్లు అందులోని విషయాలనే విద్యలో చొప్పిస్తుండడం అన్యాయమన్నారు. బీజేపీ పాలకులు రాజ్యాన్ని మతపరంగా మార్చేయకముందే అందరిలో చైతన్యం రావాలన్నారు. ప్రతిదీ కాషాయీకరణ చేస్తుండడం వల్ల దేశం వెనక్కు వెళ్లిపోతోందని ఆందోళన వెలిబుచ్చారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్, ఎస్ఎం బాషా, అబ్దుల్ రసూల్, జిల్లా అధ్యక్షుడు సుబ్బన్న, ఉపాధ్యక్షులు డాక్టర్ శశాంక మౌళి, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, తెలంగాణ, ఏపీ హెచ్ఆర్ఎఫ్ నాయకులు శ్రీనివాస్, భుజంగరావు, డాక్టర్ తిరుపతి, సీనియర్‌న్యాయవాది రాంకుమార్, శ్రీధర్, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సత్యసాయి తండులార్చన



నృత్యరూపకాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు



సంగీత కచేరీలో పాల్గొన్న కృష్ణా జిల్లా సత్యసాయి భక్తులు



స్వయం ఉపాధి కిట్లను పంపిణీ చేస్తున్న ఆర్‌జే రత్నాకర్‌రాజు

ప్రశాంతి నిలయం: పర్తి యాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన కృష్ణా జిల్లా భక్తులు ఆదివారం సత్యసాయి పాదుకా ఆష్టోత్తర తండులార్చన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వరద బాధిత వంద కుటుంబాలకు స్వయం ఉపాధి కిట్లను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్ రాజు అందజేశారు. అనంతరం సత్యసాయిని కీర్తిస్తూ భక్తులు నిర్వహించిన సంగీత కచేరీ అలరించింది. సాయంత్రం 'భరత మాత ఆరాధకులు – త్యాగధనులు' పేరుతో బాలవికాస్ చిన్నారులు, సత్యసాయియూత్ బృందం నిర్వహించిన నృత్య నాటిక ఆకట్టుకుంది.

ఉత్కంఠ పోరులో కర్నూలు విజయం

- హోరాహోరీగా సాగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ ఫైనల్ మ్యాచ్
- రన్నరప్‌ను దక్కించుకున్న వైజాగ్ జట్టు



మూడో స్థానంలో నిలిచిన అనంతపురం జట్టు

రాప్తాడు: మండలంలోని గొల్లపల్లి వద్ద ఉన్న మాంటిస్సోరీ ఎలైట్ పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన 10వ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ (పురుషుల) ఫైనల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. నువ్వానేనా అనే రీతిలో క్రీడాకారులు తలపడ్డారు. ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో వైజాగ్ జట్టుపై కర్నూలు జట్టు విజయం సాధించింది. రెండో స్థానంలో వైజాగ్, మూడో స్థానంలో అనంతపురం, చిత్తూరు జట్లు నిలిచాయి. విజేత జట్లను అభినందిస్తూ ట్రోఫీలను ముఖ్యఅతిథులు సీఐ టీవీ శ్రీహర్ష, మాంటిస్సోరి పాఠశాల ఎండీ కృష్ణభరత్, కళాశాల ఇన్‌చార్జి మధు, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు ఎస్.కేశవమూర్తి, రాష్ట్ర సంఘం సభ్యుడు విజయ్‌కుమార్, కార్యదర్శి శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, మురళి, స్కూల్ గేమ్స్ కార్యదర్శి సుగుణమ్మ, సీనియర్ పీడీలు నాగరాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి బంధం విడదీయలేనిది

- పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆర్‌జే రత్నాకర్



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి రూరల్: విద్యార్థి బంధం విడదీయలేనిదని సత్యసాయి ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ అన్నారు. పుట్టపర్తిలోని ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాలలో 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారందరూ దాదాపు 40 ఏళ్ల తర్వాత స్థానిక ఆర్‌వీజే కల్యాణ మంటపం వేదికగా ఆదివారం కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడారు. సత్యసాయిబాబా తన మాతృమూర్తి ఈశ్వరమ్మ పేరిట నిర్మించిన పాఠశాల బంధం విడదీయలేనిదన్నారు. నాలుగు దశాబ్దాల క్రితం ఇక్కడ చదువుకున్న వారు ఇలా కలవడంపై హర్షం వ్యక్తం చేశారు. నాడు ఇదే పాఠశాలలో చదువుకున్న తాను... నేడు 140 దేశాల్లో, 15వేల సేవా సమితులు, కోట్లానుకోట్ల సత్యసాయి భక్తులు మహోత్తరమైన సత్యసాయి ట్రస్ట్ సేవా కార్యక్రమాలు కొనసాగేలా చూస్తుండడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమానికి నేతృత్వం వహించిన మల్లిఖార్జున, సత్యనారాయణ, మురళీమోహన్, రామాంజనేయులు, లక్ష్మీనరసప్ప, భాస్కర్ పండితులును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు సాయిప్రసాద్, కడియాల సుధాకర్, వసంత్‌కుమార్, వెంకటేష్ కోనంకి చంద్రశేఖర్, ఫకృద్దీన్, శ్రీనివాసరెడ్డి, గూడూరు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఏకమైన 24 జంటలు

- సామూహిక వివాహాలు జరిపించిన లండన్ వాసులు



సామూహిక వివాహ వేడుకల్లో ఒక్కటవుతున్న జంటలు

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండలం చెన్నకేశవపురంలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి సన్నిధిలో ఆదివారం ఉచిత సామూహిక వివాహాలు నేత్రపర్వంగా సాగాయి. లండన్‌కు చెందిన సత్యసాయి అనిల్‌పటేల్, అనిలాపటేల్ దంపతుల సౌజన్యంతో పుట్టపర్తికి చెందిన చల్లా సాయికృష్ణ నేతృత్వంలో 24 జంటలు ఏకమయ్యాయి. బంగారు తాళిబొట్టు, గిన్నెబొట్టు, వెండి మెట్టెలు పట్టు వస్త్రాలను నిర్వాహకులు అందించారు. ముఖ్య అతిథులుగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి హాజరయ్యారు.



దంపతులకు తాళిబొట్టు అందజేస్తున్న నిర్వాహకులతో ఆర్‌జే రత్నాకర్

యువకుడి దుర్మరణం



రమేష్‌బాబు (ఫైల్)

బెళుగుప్ప: ప్రమాదవశాత్తు వాహనం పై నుంచి కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర నియోజకవర్గ పరిధిలోని అమిదాలగొంది మండలం ఈ.రామగిరి గ్రామానికి చెందిన రమేష్‌బాబు(24) దినసరి కూలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో కర్ణాటకలోని దొడ్డబళ్లాపురం పట్టణానికి చెందిన ఐచర్ (కేఏ 43ఏ 3621) వాహనానికి కూలీగా వచ్చిన రమేష్‌బాబు కర్నూలు, పత్తికొండ ప్రాంతాల్లో గొర్రెల ఎరువును బస్తాల్లో నింపి బెళుగుప్ప మండలం దుద్దేకుంట గ్రామం మీదుగా తిరుగు ప్రయాణమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున దుద్దేకుంట గ్రామ సమీపంలోకి చేరుకోగానే రాగానే వాహనంలోని బస్తాలకు కట్టిన తాళ్లు వదులైనట్లుగా గమనించిన డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన ఆపాడు. రమేష్‌బాబు లారీ పైకి ఎక్కి తాళ్లు సరిచేస్తుండగా డ్రైవర్ వాహనాన్ని ముందుకు నడిపాడు. దీంతో రమేష్‌బాబు అదుపు తప్పి తలకిందులుగా కిందపడ్డాడు. తల ఛిద్రం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇల్లు

పావగడ: స్థానిక శ్రీనివాసనగర్‌లో నివాసముంటున్న వ్యాపారి విశ్వమోహన్‌గుప్త ఇంట్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి ఆయన బెంగళూరుకు వెళ్లారు. ఈ క్రమంలో తన దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తిని ఇంటి పై భాగంలో ఉన్న గదిలో పడుకోవాలని సూచించి వెళ్లారు. అదే రోజు రాత్రి దుండగులు తొలుత ఇంటి పైభాగంలోని గదిలో నిద్రిస్తున్న వ్యక్తిని గమనించి బయట నుంచి తలుపునకు గడియపెట్టారు. అనంతరం కిందకు దిగి వచ్చి డోర్ లాక్ ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించి లాకర్లలోని బంగారు నగలు, నగదు అపహరించుకెళ్లారు. కాసేపటికి నిద్ర మేల్కొన్న పైగదిలోని వ్యక్తి బయటకు వచ్చేందుకు ప్రయత్నిస్తే తలుపులు తెరుచుకోలేదు. దీంతో ఆయన గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని గది తలుపు గడియ తీయడంతో బయటకు వచ్చారు. అనంతరం కింది ఇంటి తలుపు లాక్‌ను దుండగులు ధ్వంసం చేసి, చోరీకి పాల్పడినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో యజమాని ఆగమేఘాలపై తన స్వగృహానికి చేరుకుని పరిశీలించారు. రూ.80 వేలు విలువైన బంగారు, వెండి ఆభరణాలు, రూ.60 వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి, ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ సురేష్, ఎస్‌ఐ గురునాథ్ తెలిపారు.

రూరల్ ఫుట్‌బాల్ లీగ్ విజేత 'పురం'



విజేతగా నిలిచిన హిందూపురం టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ బాలికల జట్టు



హిందూపురం యునైటెడ్ క్లబ్ బాలుర జట్టు

హిందూపురం టౌన్: ఆర్డీటీ ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలో జరిగిన అండర్–14 బాలికల ఫుట్‌బాల్ సూపర్ లీగ్ టోర్నీ విజేతగా హిందూపురం టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు నిలిచింది. ఉరవకొండ జట్టుతో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తలపడిన హిందూపురం జట్టు 4 గోల్స్ తేడాతో విజయం సాధించింది. అనంతరం విజేతలకు ఆర్డీటీ ఫుట్‌బాల్ కోఆర్డినేటర్ కిషోర్‌బాబు, కోచ్ దుర్గాప్రసాద్ ట్రోఫీలను అందించారు. అలాగే బాలుర సూపర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌లో చాపిరి జట్టుపై 7 గోల్స్ తేడాతో హిందూపురం యునైటెడ్ క్లబ్ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో వివిధ క్లబ్ మేనేజర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

వైభవం.. బ్రహ్మరథోత్సవం

- ఏపీ, కర్ణాటక భక్తులతో పోటెత్తిన డి.హీరేహాళ్



ప్రత్యేక అలంకరణలో నీలకంఠేశ్వరుడు



రథోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు

డి హీరేహాళ్(రాయదుర్గం): జిల్లాలోని కర్ణాటక సరిహద్దున ఉన్న డి.హీరేహాళ్ మండలంలో ప్రసిద్ధి చెందిన నీలకంఠేశ్వరుడి బ్రహ్మ రథోత్సవం ఆదివారం సాయంత్రం అత్యంత వైభవంగా సాగింది. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేలాది మంది భక్తులతో డి.హీరేహాళ్ వీధులు కిక్కిరిసాయి. నందికోలు, చెక్కభజన, కోలాటం, బొమ్మల ప్రదర్శనతో కళాకారులు ఆకట్టుకున్నారు. కాగా, ఆదివారం వేకుజాము నుంచే ఆలయంలో విశేష అభిషేకాలు, పూజలు, అర్చనలు పెద్ద ఎత్తున జరిగాయి. తొలుత మడితేరు నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వామి ఉత్సవ మూర్తిని వేదమంత్రోచ్చరణల మధ్య పల్లకీలో తీసుకొచ్చి బ్రహ్మరథంపై అధిష్టింపజేసి హర నామస్మరణతో ముందుకు లాగారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. కాగా, రాయదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలసి నీలకంఠేశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం రథం లాగి మొక్కుతీర్చుకున్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ హెచ్.లక్ష్మి, నాయకులు గొడిశెలపల్లి రవీంద్రానాథ్‌రెడ్డి, తొండ వెంకటేశులు, రహంతుల్లా, అంజిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సింగాడి జగదీష్, సర్పంచ్ పరమేష్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.